


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 15-4-2025
సంపుటి: 21 సంచిక: 18
పేజీలు: 8 వెల: రూ.1



- సిండికేట్‌గా మారి దండుకుంటున్న 11 మంది
- విశాఖ నుంచి శ్రీకాకుళానికి బెట్టింగ్ యాప్ లైన్
- దాన్ని గ్రామాల వరకు చేర్చి యువతపై ఆశల వల
- బెట్టింగులతో భారీగా నష్టపోతున్న జిల్లా జనం
- ప్రస్తుత ఐపీఎల్ సీజను ముగిసేలోగా మరెందరు మునిగిపోతారో?

## పాత బుకీలు..
# కొత్తగా బెట్టింగులు!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశారన్న కారణంతోనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, సెలబ్రిటీలపై కేసులు నమోదు చేస్తున్న పోలీసులు అసలు ఈ రాష్ట్రంలో బెట్టింగ్ అనే జూదాన్ని వ్యవస్థీకృతం చేసినవారిని ఏం చేయాలి?

శ్రీకాకుళం లాంటి మారుమూల జిల్లాలో ఆరో తరగతి చదువుతున్న కుర్రాడు సైతం బెట్టింగ్ యాప్‌లలో పాయింట్లు కొనుగోలు చేస్తుంటే.. వాటిని గ్రామస్థాయికి చేర్చిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి?


కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపింది. ఆ తర్వాత డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారికి చుక్కలు చూపించింది. తాజాగా శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వర్ రెడ్డి ఆకతాయిలు అల్లరి చేష్టలకు పాల్పడితే నేరుగా తనకు ఫోన్ చేయండంటూ ప్రకటించారు. ఇంత జరుగుతున్నా - మిగతా చివరి పేజీలో

- పీటముడిగా మారిన ఏడు పంచాయతీల సమస్య
- కేబినెట్ ముందుకు కుశాలపురం, తోటపాలెం గ్రామాల ఫైల్
- మిగతా ఐదు గ్రామాల నుంచి పెరగనున్న ఒత్తిడి
- కార్పొరేషన్ నుంచి మున్సిపాలిటీకి తగ్గించడం కూడా ఇబ్బందే
- రాగోలు విలీనంతో ముందుకెళ్లాలన్న ఆలోచన




## విలీనం నుంచి విముక్తి..
# అంత వీజీ కాదండోయ్!

**మున్సిపాలిటీగా ఉన్న శ్రీకాకుళానికి కార్పొరేషన్ హోదా కల్పించేందుకు విలీనం చేసిన పంచాయతీల జాబితా నుంచి ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన కుశాలపురం, తోటపాలెం పంచాయతీలు బయటపడనున్నాయి.**


GOVERNMENT OF ANDHRA PRADESH
PANCHAYAT RAJ & RURAL DEVELOPMENT (E&R) DEPARTMENT
Memo No. 2740144 /E&R/A1/2025-1 Dated:03-03-2025
Sub:- PR&RD (E&R) – Representation - Sri Nadukuditi Eswara Rao, Hon'ble M.L.A Etcherla Assembly Constituency Srikakulam District, Andhra Pradesh - request for de-notifying two Gram Panchayat from inclusion in Srikakulam Municipal Corporation and keep them in erstwhile Etcherla Mandal- Regarding.
//FORWARDED::BY ORDER//
SECTION OFFICER
KUSALAPURAM / THOTAPALEM } Panchayats
Srikakulam Municipal Corp } → Denotify as GP's only in Etcherla Mandal

Nadukuditi Eswara Rao (NER) M.L.A
Lr.No.112/MLA-Etcherla/2025, dated 12-03-2025
To
Sri Ponguru Narayana garu,
Hon'ble Minister of Municipal Administration & Urban Development (MAUD),
The public of Kushalapuram and Thotapalem Gram Panchayats of erstwhile Etcherla mandal in Etcherla constituency are praying for taking of speedy decision on the matter as all the developmental works are not being received to those two villages and they are not accepting the development works from Srikakulam Municipal Corporation, due to which development in those villages has been hampered and common public have been experiencing severe hardship.


సీఎం పేషీ నుంచి పీఆర్ కమిషనర్‌కు వచ్చిన ఎండార్స్‌మెంట్

మున్సిపల్ మంత్రికి ఎమ్మెల్యే ఈశ్వరరావు రాసిన లేఖ

మొదటి నుంచి శ్రీకాకుళం మున్సిపాలిటీలో విలీనం కావడాన్ని మిగిలిన ఐదు పంచాయతీల మాదిరిగానే ఈ రెండు పంచాయతీలూ వ్యతిరేకించాయి. దీంతో వీటికి విముక్తి కల్పిస్తామన్న నినాదంతో గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి నడికుదిటి ఈశ్వరరావు పోటీ చేసి పెద్ద మెజార్టీతో గెలిచారు. ఇప్పుడు ఈ ప్రతిపాదనను కేబినెట్‌లో ఆమోదింపజేసుకొని చట్టం తేవడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మంగళవారం నాటి కేబినెట్ మీటింగ్‌లో ఈ అంశం ప్రస్తావనకు రాకపోతే మరో సమావేశంలోనైనా దీన్ని ఆమోదింపజేసుకుంటారు. ఈ రెండు పంచాయతీలు కార్పొరేషన్ నుంచి బయటకొచ్చేస్తే మిగిలిన ఐదు విలీన పంచాయతీలతో పాత మున్సిపాలిటీకి ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇందులో సమాధానం లేని జవాబులెన్నో. ప్రజాప్రతినిధులకు కూడా దీని మీద కచ్చితమైన అవగాహన లేకపోవడం వల్ల ఎన్నికలకు వెళ్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ చట్టం ఏం చెబుతోంది? న్యాయం ఎలా ఉంది? అన్న కోణాలను స్పృశిస్తే.. కార్పొరేషన్‌కే కాదు.. విలీన పంచాయతీలు బయటకొచ్చినా కూడా స్థానిక ఎన్నికలు జరగవని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఇక లోతుల్లోకి వెళితే..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎన్.ఈశ్వరరావు తోటపాలెం, కుశాలపురం పంచాయతీలను నగరపాలక సంస్థ నుంచి బయటకు తీసుకువస్తానని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. అంతకు ముందు వైకాపా ఈ రెండు పంచాయతీలను విలీనం చేసిన సమయంలో ఎచ్చెర్ల - మిగతా చివరి పేజీలో






• ఎడిటోరియల్

# విపత్తుల జోన్‌లో అభివృద్ధి కేంద్రీకరణా?!

ఆంధ్రప్రదేశ్ విభజన, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఎక్కడ నిర్మించాలన్నది సూచించేందుకు కేంద్ర ప్రభుత్వం 2014లో శివరామకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ వివిధ ప్రాంతాలను పరిశీలించి కొన్ని ప్రాంతాలను సూచిస్తూ.. వాటి మంచీచెడులను కూడా తన నివేదికలో పొందుపర్చింది. సదరు కమిటీ సూచించిన ప్రాంతాల్లో అమరావతి ఉన్నప్పటికీ ఆ ప్రాంతం వరదలు, భూకంపాలు, తుపానుల ప్రభావానికి గురయ్యే ప్రమాదముందని కమిటీ పేర్కొంది. అంతేకాదు.. రాయలసీమ ప్రాంతంలో రాజధాని నిర్మించడం సహజ న్యాయంగా ఉంటుందని, రాయలసీమలో రాజధానిని నిర్మిస్తే సీమాంధ్రుల శ్రీబాగ్ ఒప్పందం అమలై రెండు ప్రాంతాలకు సమన్యాయం జరిగినట్లు అవుతుందని పేర్కొంది. ఆ కమిటీ ఇచ్చిన నివేదికను పట్టించుకోకుండా అప్పటి టీడీపీ ప్రభుత్వం అమరావతి ని రాజధానిగా నిర్ణయించింది. అందుకే ప్రధాని మోదీ కేవలం 'చెంబుడు నీళ్లు, పిడికెడు మట్టి' ఇచ్చి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అనాలోచిత నిర్ణయానికి సహకరించలేదు. అదే మోదీ, చంద్రబాబు ఇప్పుడు రాజకీయ అవసరాల కోసం తిరిగి అమరావతినే భుజానికెత్తుకుని అభివృద్ధి కేంద్రీకరణే ఏకైక లక్ష్యంగా ముందడుగు వేస్తున్న విషయం గమనించాలి. అమరావతి యావలో పడి పాత సమస్యలను మాత్రం విస్మరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాడగానే భారీ వరదలతో విజయవాడ, అమరావతి ప్రాంతాలను జలమయం చేయడం ద్వారా వరుణుడు మొదటి హెచ్చరిక జారీ చేశాడు. ఇప్పుడు భూకంపం రూపంలో మళ్లీ హెచ్చరికలు వస్తున్నాయి. ప్రకృతి విపత్తుల నుంచి అమరావతిని రక్షించడానికి నగర నిర్మాణానికి ముందే రక్షణ కరకట్ట లకు, వరద నీటిని నేరుగా కృష్ణానదిలోకి మళ్లించడానికి నిర్మించే భారీ ఎత్తిపోతల ప్రాజెక్టులకు తెస్తున్న అప్పులు తీర్చడానికే రాష్ట్ర ప్రజలకు వందేళ్లు పడుతుంది. అలాంటప్పుడు ఎన్నో త్యాగాలు చేసి నేడు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న రాయలసీమ ప్రాంతం ఏం కావాలి. దీన్ని పట్టించుకో కుండా ఇపుడు మళ్లీ అమరావతి కోసం అదనంగా 44వేల ఎకరాల సేకరణకు కూటమి ప్రభు త్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే గత ప్రభుత్వం రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్ర, రాష్ట్ర సంస్థలను నయానో భయానో అమరావతికి తరలిస్తున్నారు. రాజధాని విష యంలో తప్పు చేశామనే పశ్చాత్తాపం ఈ ప్రభుత్వంలో ఏమాత్రం కనపడకపోవడం విచిత్రం. ప్రకృతి విపత్తులకు నిలయమైన అమరావతి ప్రాంతంలో రాజధాని నిర్మాణానికి ఇప్పటికే 33వేల ఎకరాలు సేకరించడం ద్వారా రాష్ట్రంలోనే అతి సారవంతమైన, మూడు పంటలు పండే డెల్టా ప్రాంతాన్ని ధ్వంసం చేశారు. రాజధాని నిర్మాణం ద్వారా బంగారు భూములను కాంక్రీట్ జంగిల్‌గా మార్చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు మరో 44వేల ఎకరాల సేకరణకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 2014-19 కాలంలో అప్పటి ఎన్డీయే ప్రభుత్వం శ్రీబాగ్ ఒప్పందాన్ని తుంగలో తొక్కడానికి బీజాలు వేస్తే నేడు అదే సర్కారు మరోసారి అమరావతిలోనే కేంద్రీకృతం చేయడానికి సిద్ధం చేస్తోంది. ఎన్నో త్యాగాలు చేసిన రాయలసీమ ప్రాంతానికి దీనివల్ల అన్యాయం జరుగు తున్నా బీజేపీ మౌనంగా ఉంది. 2018లో కర్నూలు నిర్వహించిన సమావేశంలో ప్రకటించిన రాయలసీమ డిక్లరేషన్‌ను ఆ పార్టీ ఒకసారి గుర్తు చేసుకోవాలి. 'రాష్ట్ర రెండో రాజధానిని రాయలసీమలో ఏర్పాటుచేయాలి.. ఈ ప్రాంతంలోనే హైకోర్టు ఏర్పాటు చేయాలి.. ఆరు నెలలకు ఒకసారి రాయలసీమలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి.. అధికారమంతా ఒకేచోట కేంద్రీకృతం చేయ వద్దు..' తదితర డిమాండ్లతో చేసిన రాయలసీమ డిక్లరేషన్ అమలుకు కృషి చేస్తామని ఆనాడు శపథం చేసిన బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు నేడు మౌనం వహించాయి. అసలు రాయల సీమ డిక్లరేషన్‌ను ఆమోదించామన్న విషయమైనా బీజేపీకి గుర్తుందో లేదో.. అనుమానమే. ఇది అవకాశవాదం కాదా? అమరావతి రాజధానిని ఇంకా విస్తరించేందుకు వీలుగా భూములు కబళించాలని రెండు చేతులు బార్లా చాస్తున్న కూటమి సర్కారు కేంద్రీకరణ చర్యలకు సహకరించడమంటే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయమైన చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరోక్షంగా నాంది పలికినట్లవుతాయి. ఇలాంటి వాతావరణం నుంచే ప్రత్యేక రాష్ట్ర నినాదాలు పట్టుకొస్తుంటాయి. అందుకే ప్రభుత్వాలు అభివృద్ధి వికేంద్రీకరణకు, అన్ని ప్రాంతాల సమగ్రాభి వృద్ధికి పూనుకోవాల్సిన అవసరం ఉంది.

# జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు శ్రీకాకుళం జిల్లాలో ప్రతిభ కనబర్చిన 5-18 ఏళ్ళ (31 జూలై,2025లోపు) వయస్సు గల బాలల నుండి కేంద్ర ప్రభుత్వ స్త్రీ,శిశు సంక్షేమ శాఖ,జాతీయ ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ్ బాల్ పురస్కారాలను ప్రధానం చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్యసాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు మొదలైన వాటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్న భారత సంతతికి చెందిన ఆసక్తిగల గల బాలలు ఈ ఏడాది జులై 31 తేదీ లోపుగా ఈ వెబ్సైట్. http:/awards.gov.in ద్వారా దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా పంపించాలని సూచించారు, కేంద్రం నియమించిన కమిటీ ద్వారా పరిశీలించి,ఎంపిక కాబడ్డ బాలలకు న్యూఢిల్లీలో 2026, జనవరిలో దేశ రాష్ట్రపతి చేతులు మీదుగా బహుమతితో పాటు, ప్రశంసా పత్రాన్ని,జ్ఞాపికను అందజేయనున్నారని చెప్పారు. మన రాష్ట్రంలో ప్రతిభగల ఆయా రంగాల బాలలను వెన్ను తట్టి ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్రంలోని వివిధశాఖల ద్వారా వీటిపై విరివిగా అవగాహనా కార్యక్రమాలు, సమావేశాలు, సదస్సులు, నిర్వహించి ఆంధ్ర రాష్ట్ర బాలల ప్రతిభా, పాటవాలు దేశవ్యాప్తంగా ఇనుమడింపజేసేలా చర్యలు చేపడతామన్నారు.



నగరంలోని మిర్తిబట్టి పూడిక పనులను పరిశీలిస్తున్న నగర కమిషనర్ పీవీవీడీ ప్రసాదరావు, ఎంహెచ్ఓ కమలాకర్, ఏఈలు సుధీర్, సృజనలు పరిశీలిస్తున్న దృశ్యం
- సత్యంన్యూస్, శ్రీకాకుళం

# ఇంజినీరింగ్ విద్యార్థులకు సువర్ణావకాశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇంజినీరింగ్ విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్ విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ఎస్ డీసీ) ఆధ్వర్యంలో సమ్మర్ ఆన్‌లైన్ తాత్కాలిక ఇంటర్న్‌షిప్ కార్యక్రమం-2025 ప్రారంభమైంది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన మూడవ, నాలుగవ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తోంది. కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ శాఖల విద్యార్థులు ఈ ఇంటర్న్‌షిప్‌కు అర్హులు. రెండు నెలలపాటు సాగే శిక్షణలో 80 గంటల సిద్ధాంత పాఠాలు, 40 గంటల ప్రాయోగిక శిక్షణ ఉంటుంది. ముఖ్యమైన కోర్సులలో క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ యాప్ అభివృద్ధి, పైథాన్ ద్వారా డేటా విశ్లేషణ, వెబ్ అభివృద్ధి, అంతర్నిర్మిత వ్యవస్థలు, త్రీడీ ఆటల రూపకల్పన, కాటియా నమూనా రూపకల్పన, రెవిట్ ఆర్కిటెక్చర్ మోడలింగ్ ఉన్నాయి. ఆన్‌లైన్ విధానంలో అనుభవజ్ఞులైన శిక్షకులు శిక్షణ ఇస్తారు. ప్రతిరోజూ ప్రశ్నాంత్రాలు, ప్రతివారం అంచనాలు, ప్రాజెక్టు సమీక్షలు నిర్వహించబడతాయి. అన్ని అంశాలను విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు ఏపీఎస్ఎస్‌డీసీ ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ అందిస్తుంది. ఈ ధ్రువపత్రానికి ఉన్నత విద్యా మండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) గుర్తింపు కలదు. ఈ ఇంటర్న్‌షిప్‌ను రెండు విడతలుగా నిర్వహించనున్నారు. మొదటి విడత ఏప్రి ల్ 28న, రెండవ విడత మే 12న ప్రారంభమవుతుంది. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000 మాత్రమే. ఆసక్తిగలవిద్యార్థులు https://naipunyam. ap.gov.in/ user-registration?pageRonline-short-term-internship వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు ఎగ్జిక్యూటివ్ టెక్నికల్ టి.శ్రీకన్యను 8790700295 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.



అరసవల్లి సూర్యనారాయణస్వామివారిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈమేరకు వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్‌శర్మ ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది అట్టాడ శ్రీనివాస్, రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.
- సత్యంన్యూస్, శ్రీకాకుళం

# ట్రెజరీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థికసాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక మంగువారితోటలో నివాసముంటున్న ఎస్.నాగరాజు, శ్యామల కుటుంబానికి శ్రీకాకుళం ట్రెజరీ హెల్పింగ్ హ్యాండ్స్ అండగా నిలిచింది. నాగరాజు అధిక టిబి, లివర్ సంబంధిత వ్యాధితో గత కొన్ని సంవత్సరాలుగా బాధపడుతూ ఇంటికే పరిమితమవ్వగా, అర్ధాంగి శ్యామల రెండు కిడ్నీలు పాడవ్వటం బాధాకరమని, ప్రస్తుతం నగరంలో ఒక ప్రయివేట్ వైద్యశాలలో డయాలసిస్ పొందుతున్నారన్నారు. కనీసం మందులుకొనే స్థోమత కూడా లేదని ట్రెజరీ హెల్పింగ్ హ్యాండ్స్ మాదారపు డేవిడ్ మంగళవారం అన్నారు. ట్రెజరీ హెల్పింగ్‌హ్యాండ్స్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేశామని, ఈనెల సేవా కార్యక్రమంలో భాగంగా ఈరోజు రూ.10వేల ఆర్థిక సాయంతోపాటు రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను అందించామన్నారు. నాగరాజు కుమార్తెకు ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో 856 మార్కులు సాధించారని, ఆర్థికంగా ఉన్నత చదువులు చదించలేని పరిస్థితి కాగా, ఆ విద్యార్థినికి ఉన్నత చదువుల నిమిత్తం తాము (డేవిడ్, ప్రదీప్, రాజశేఖర్, ప్రసాద్) అండగా నిలుస్తామని భరోసా కల్పించామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలుగాని వీరి కుటుంబానికి అండగా నిలవాలన్నారు. సహాయం చేయాలనుకునేవారు 8106293580 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కె.వరప్రసాద్ (జూనియర్ అసిస్టెంట్) కె.లక్ష్మమ్మ, కే.హేమలత, ఇతర సభ్యులతోపాటు, ఉర్లం శివతేజ, బమ్మిడి వేణు, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



# నాని లాజిక్ కరెక్టేనా?




తన సినిమాని మార్కెట్ చేసుకోవడం ఎలాగో నానికి బాగా తెలుసు. "కోర్ట్" సినిమా అందుకు పెద్ద ఉదాహరణ. చిన్న సినిమాగా విడుదలై పెద్ద విజయాన్ని తన ఖాతాలో వేసుకొంది. కంటెంట్ లో బలం ఉండడం ఒక కారణమైతే, నాని ఈ సినిమాని జనంలోకి తీసుకెళ్లిన విధానం మరో కారణం. 'ఈ సినిమా నచ్చకపోతే నా రాబోయే హిట్ 3 చూడొద్దు' అని చెప్పి, అందర్నీ తన వైపు తిప్పుకొన్నాడు. ఈ స్టేట్ మెంట్ బాగా వర్కవుట్ అయ్యింది. మే 1న రాబోతున్న హిట్-3కి కూడా తానే నిర్మాత. ఈ సినిమా ప్రమోష న్‌ని కూడా తనదైన స్టైల్ లో మొదలు పెట్టేశాడు నాని. 'ఈ సినిమాకు ఆడాళ్లూ, పిల్లలూ దూరం గా ఉండండి. మా అబ్బాయికి కూడా ఈ సినిమా చూపించను' అనేశాడు. నిజంగా ఇది బోల్డ్ స్టేట్‌మెంటే. పిల్లలు, ఆడాళ్లూ చూడలేనంత వైలెన్స్ తన సినిమాలో ఉందని స్ట్రయిట్ గానే చెప్పేశాడు నాని. తన సినిమాలు పిల్లలకు బాగా నచ్చుతాయి. లేడీ ఫాలోయింగ్ నానికి బలం. వాళ్లిద్దర్నీ నాని ఈ స్టేట్‌మెంట్ తో దూరం చేసుకొన్నాడు.కాకపోతే ఇక్కడ నాని దగ్గర ఓ లాజిక్ వుంది. 'హిట్ 3' ఎవరి కోసం తీశాడో నానికి బాగా తెలుసు. యాక్షన్ ఇష్టపడేవాళ్ల కోసమే తాను ఈ సినిమాని క్యాటర్ చేస్తున్నానని నాని గ్రహించాడు. అదే ఫాలో అవుతున్నాడు. 'యానిమల్', 'మార్కో' సినిమాలేమైనా పిల్లలు చూశారా? ఆ సినిమాలు ఎవరికి నచ్చాలో వాళ్లకు నచ్చాయి. సూపర్ హిట్ అయ్యాయి. 'హిట్ 3' కోసం నాని ఫాలో అవుతున్న ఫార్ములా కూడా ఇదే కావొచ్చు. ఈ రకంగా ఆలోచిస్తే నాని లాజిక్ కరెక్టే. ఇప్పటి యూత్ ఆలోచనలు మారిపోయాయి. వాళ్లకు ఏదైనా సరే.. హై డోస్‌లో ఇవ్వాల్సిందే. అలాంటి సినిమాలు నచ్చుతున్నాయి కూడా. అందుకే నాని ఇప్పుడు వాళ్లకే గాలం వేయబోతున్నాడు. నాని ఇంత యాక్షన్ చేస్తే జనం చూస్తారా? అనే అనుమానాలూ అక్కర్లెద్దు. ఎందుకంటే ఇది వరకే 'దసరా' సినిమాలో నాని తన ఇమేజ్ మార్చుకోవడానికి ప్రయత్నించాడు. అక్కడ సక్సెస్ అయ్యాడు. కాబట్టి నాని వెండి తెరపై గొడ్డలి పట్టుకొని రప.. రప.. నరుకుతున్నా, చూడ్డానికి నమ్మశక్యంగానే ఉందిప్పుడు.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

# క్యూట్ కేతిక కవ్వింపులు

ఆకాష్ పూరి హీరోగా నటించిన 'రొమాంటిక్' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ కేతిక శర్మ. ఆ సినిమా నిరాశ పరిచిన అందంతో పాటు నటనతో ఆకట్టుకున్న కేతిక శర్మకు టాలీవుడ్‌లో వరుసగా ఆఫర్లు దక్కాయి. అదే ఏడాదిలో లక్ష్య సినిమాలో నటించింది. ఆ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద పెద్దగా ఆడలేదు. వరుసగా రెండు ఫెయిల్యూర్స్ పడితే ఏ కొత్త హీరోయిన్ అయినా ఆఫర్లు దక్కించుకోవడం కాస్త కష్టమే. అయినా కూడా ఈ అమ్మడికి మెగా హీరో వైష్ణవ్ తేజ్‌తో రంగరంగ వైభవంగా సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా హిట్ అయి ఉంటే కచ్చితంగా టాలీవుడ్‌లో ఈ అమ్మడికి మంచి బ్రేక్ దక్కేది. కానీ ఆ సినిమా కూడా నిరాశనే మిగిల్చింది. పవన్ కళ్యాణ్ నటించిన 'బ్రో' సినిమాలో కీలక పాత్రలో నటించడం ద్వారా మరో అవకాశంను దక్కించుకుంది. సినిమాలు ఫెయిల్యూర్ అవుతూ వచ్చినా లక్కీగా ఈ అమ్మడికి గుర్తింపు పెరుగుతూ వచ్చింది. వరుసగా ఈ అమ్మడు చేసిన సినిమాలు బాక్సాఫీస్ నిరాశ పరుస్తూ వచ్చినా ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది రాబిన్‌హుడ్‌లో ఐటెం సాంగ్‌ను చేయడం ద్వారా మరోసారి ప్రేక్షకులను పలకరించింది. ప్రస్తుతం ఈమె రెండు సినిమాల్లో నటిస్తోంది. తెలుగు సినిమాల్లోనే కాకుండా ఈసారి వేరే భాషలోనూ ఈమె నటిస్తున్న కారణంగా లక్ కలిసి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆమె సన్నిహితులు నమ్ముతున్నారు. మరి ఈ అమ్మడికి హిట్ పడేనా చూడాలి. సినిమాల్లో అందంగా కనిపించే అవకాశాలు తక్కువే ఉన్నా సోషల్ మీడియాలో అందాల ప్రదర్శణకు హద్దులు ఉండవు. కనుక సోషల్ మీడియాలో అందరు హీరోయిన్స్ మాదిరిగానే కేతిక శర్మ కూడా రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. వరుస ఫ్లాప్స్ పడ్డా కూడా ఈమెకు ఇంకా ఆఫర్లు దక్కుతున్నాయి అంటే కచ్చితంగా అందుకు ఇలాంటి అందమైన ఫోటో షూట్స్‌ను షేర్ చేయడం అనే అభిప్రాయం చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ ఇలాంటి ఫోటోలు చూస్తే అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈమె షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతూ ఉంటాయి. తాజా ఫోటోల్లో కేతిక క్యూట్‌గా కనిపిస్తూనే కవ్విస్తోంది. విభిన్నమైన ఔట్ ఫిట్‌లో సింపుల్ అండ్ స్వీట్ అనిపించుకుంటుంది. బ్లూ జీన్స్ , వైట్ టాప్‌తో పాటు, ఒక షర్ట్ బటన్స్ లేకుండా ధరించి ఉన్న కేతిక ఫోటోలను నెటిజన్స్ అలా చూస్తు ఉన్నారు. తక్కువ సమయంలోనే లక్ష లైక్స్‌ను సొంతం చేసుకున్న ఈమె మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అయింది. దాదాపుగా 35 లక్షల మంది ఇన్‌స్టా ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న కేతిక శర్మ ఇంతటి అందంతో మరి కొన్నాళ్ల తర్వాత అయినా వరుసగా ఆఫర్లు దక్కించుకుంటుంది అనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. కేతిక శర్మ ఇంత అందంగా ఉంది కనుక ఇండస్ట్రీలో కచ్చితంగా మంచి సినిమాల్లో నటించే అవకాశాలు రావాల్సిందే అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు.



- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# ఉపాధి పనులు కల్పించాలి

## ఎంపీడీవోకు విన్నవించిన గ్రామస్తులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

వాకలవలస గ్రామం పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా వేతన దారులకు పని కల్పించాలని స్థానికులు ఎంపీడీవోను కలిసి విన్నవించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారిని గ్రామస్తులు కలిసి వినతిపత్రం అందించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఉపాధి హామీ పనులు ప్రారంభం కాలేదన్నారని, పనులు లేక నగరానికి వెళుతున్నారని తెలిపారు. ఉపాధి ఫీల్డ్ సహాయకుడిని ప్రశ్నిస్తే కాలయాపన చేస్తున్నారు తప్ప పనులు చేపట్టడానికి చర్యలు తీసుకోవడం లేదని వివరించారు. గ్రామంలో ఉపాధి మేట్‌లు నియామకం పట్ల తలెత్తిన వివాదం కారణంగా ఉపాధి పనులు జరగడం లేదని వివరించారు. తక్షణమే జోక్యం చేసుకొని పనులు చేపట్టాలని కోరినవారిలో పేడాడ రాజు, సోమేషు, ధర్మా తదితరులు ఉన్నారు.



# రాష్ట్ర ప్రొహిబిషన్ & ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్

## - అసోసియేషన్ అధ్యక్షుడిగా గురువుబెల్లి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన గురువుబెల్లి వెంకట రమణారావు ఎన్నికయ్యారు. సోమవారం గుంటూరులో జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో ఈయన్ను ఎన్నుకున్నారు. రమణ శ్రీకాకుళం ఈఎస్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పని చేస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ హెడ్ కానిస్టేబుల్ వెల్ఫేర్‌కు సంబంధించి వారి సమస్యలపై ఉన్నతాధికారులతో చర్చించి, వారి సమస్యలను పరిష్కరిస్తూ అందరిని అన్ని విషయాల్లో సంప్రదిస్తూ ముందుకు వెళ్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# ఓటర్లు జాబితా తయారీపై సమావేశం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మంగళవారం శ్రీకాకుళం తహశీల్దారు కార్యాలయంలో ఆర్డీఓ కె.సాయిప్రత్యూష అధ్యక్షతన నియోజకవర్గంలోగల అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రతినెల జరుగుతున్న అన్ని రాజకీయ పార్టీల సమావేశంలో ఓటర్లు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల వారు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఓటర్లు జాబితాలో మరణించిన వారిని, వివాహం జరిగిన ఓటర్లను తొలగించే విధంగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం తహశీల్దార్ ఎస్.గణపతిరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ జి.కె.శ్రీనివాసరావు, గార తహశీల్దార్ పద్మావతి, రాజకీయ పార్టీల నుండి మాదారపు వెంకటేష్, కుమారి, ఏ.శ్రీనివాసరావు, ఆర్.పురుషోత్తంలు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



(సత్యంన్యూస్, పాతపట్నం)

నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. సుమారు 30 సంవత్సరాలుగా అచ్యుతాపురం, అంతరాభ, చంగుడి, సరాలి, అప్పోజిపేట, మాకనాపల్లి గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే సుమారు రూ.450 కోట్లు పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి కేటాయించిందన్నారు. పాతపట్నం చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ప్రతీ గ్రామానికీ రహదారి నిర్మిస్తున్నామని, డోలీ మోత లేని గిరిజన గ్రామాలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ప్రజలు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

### బీసీ సంక్షేమ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శిగా

# రావులపల్లి రెండోసారి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీసీ సంక్షేమ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శిగా రావులపల్లి సురేంద్రను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాక వెంగళరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుడుమూరు రాజేష్ చేతుల మీదగా నియమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరాధ్యక్షుడు బాడాన దేవభూషణ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అమీరుల్లా బేగ్, గద్దిబోయిన కృష్ణ పాల్గొన్నారు. తనను జాతీయ బీసీ సంక్షేమ సంఘం టౌన్ ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల జాతీయ నాయకులకు, రాష్ట్ర నాయకులకు, జిల్లా బీసీ నాయకులకు సురేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. రెండోసారి తనకు అప్పగించిన ఈ బాధ్యతను త్రికరణ శుద్ధితో నిర్వహిస్తానని సురేంద్ర ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# రేపు ఎమ్మెల్యే పల్లెనిద్ర

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం నియోజకవర్గ నగర పరిధిలో పాజల్‌బాగ్ పేట, సీపాన్నాయుడుపేటలో బుధవారం సాయంత్రం ఐదు గంటల నుంచి గురువారం ఉదయం10 గంటల వరకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సీపన్నాయుడుపేటలో రాత్రి బస చేస్తారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది హాజరు కావలెను. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ఈ పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం తెలిపింది. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలని కోరారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# ఓబీసీ యత్నాలకు కేంద్రమంత్రి సహకారం

## -కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు కృతజ్ఞతలు

## -పాడేరు రాష్ట్ర శిష్టకరణ సంఘ సమావేశం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆర్థికంగా వెనుకబడిన శిష్టకరణ సమాజాన్ని ఓబీసీ జాబితాలో చేర్పించేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్న కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు రాష్ట్ర శిష్టకరణ సంఘ కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. అల్లూరి జిల్లా పాడేరులో ఆదివారం జరిగిన సంఘం రాష్ట్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి ఆధ్వర్యం వహించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కుమహంతి రాజా మాట్లాడుతూ ఓబీసీ జాబితాలో చేరిక అంశంపై ఇటీవల కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో ఢిల్లీలో జరిగిన పరిణామాలను సభ్యులకు వివరించారు. సమావేశ ప్రారంభంలో ఇటీవల మృతి చెందిన డబ్బీరు వెంకటరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శిష్టకరణ జాతి ఒక ఆణిముత్యాన్ని కోల్పోయిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కాగా సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించారు. శిష్టకరణ సమాజానికి చెందిన వారందరూ ఐకమత్యంగా ఉండాలని, వాట్సప్‌లో వచ్చే అంశాలపై అత్యుత్సాహంతో స్పందించవదని సంఘ పెద్దలు సూచించారు. అనంతరం నూతన కార్యవర్గం ఏర్పాటు, భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించి మినిట్స్ నమోదు చేశారు. రాష్ట్ర సమావేశానికి ఏర్పాట్లు చేసి సహకరించిన శిష్టకరణ సంక్షేమ సంఘం పాడేరు అధ్యక్షుడు పుండరీకాక్షయ్య, ఇతర సభ్యులకు సమావేశం కృతజ్ఞతలు తెలిపింది.



మండలంలోని కొరసవాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన బంగారమ్మ తల్లి ఆలయ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రూ.50వేలు ఆలయ అభివృద్ధికి అందజేశారు.

– సత్యంన్యూస్, పాతపట్నం

# మొక్కలు నాటిన ఎంపీ కలిశెట్టి

(సత్యంన్యూస్, లావేరు)

మండలంలోని కలిశెట్టి గూడెం శ్రీ పైడితల్లి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రోజువారీ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయం ఆవరణలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనజీవి పద్మశ్రీ రామయ్య స్ఫూర్తితో రోజుకో మొక్క నాటుతున్నట్లు వివరించారు. అనంతరం గ్రామంలో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



# ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు జీ.డీ.ఏ, ఐ.సి.యూ, ఓ.టి అసిస్టెంట్ కోర్సులలో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు బి.ఎస్సీ/డిప్లొమా, పారామెడికల్/ నర్సింగ్/ బి.పి.టి కోర్సులలో ప్రవేశాలు జరుగుతున్నాయన్నారు. డిగ్రీ పాసైన విద్యార్థులకు పీజీ కోర్సులను అందిస్తున్నట్లు ఆసక్తి గలవారు సెల్ నెంబర్లు 9121999654కు ఫోన్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం సమీపాన రాగోలులోని జెమ్స్ క్యాంపస్ లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

# జూనియర్ రెడ్ క్రాస్ విభాగం ఏర్పాటు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి శ్రీకాకుళం జిల్లా శాఖ, జిల్లా జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు స్థానిక సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో జూనియర్ రెడ్‌క్రాస్ విభాగాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం జూనియర్ రెడ్‌క్రాస్ వాలంటీర్స్‌కు ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్, పి.జగన్మోహనరావు, స్కూల్ ప్రిన్సిపల్ ప్రభావతిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ మాట్లాడుతూ జూనియర్ రెడ్ క్రాస్ ద్వారా చేయవలసిన కార్యక్రమాల ఆవశ్యకత, ప్రథమ చికిత్సలో ఉన్న సీపీఆర్, రికవరీ, యాంటీషాక్, ఎలక్ట్రికల్ షాక్, స్నేక్ బైట్, హార్ట్ ఎటాక్ తదితర అంశాల్లో ప్రథమ చికిత్స చేసి ఎలా బ్రతికించాలో విద్యార్థులకు వివరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ జూనియర్ రెడ్ క్రాస్ వాలంటీర్స్ నేటికాలం విద్యార్థులు విద్యతోపాటు సమాజ సేవకు ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రథమ చికిత్స నేర్చుకుని, రెడ్ క్రాస్ ద్వారా మరిన్ని సేవలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సెయింట్‌జోసెఫ్ స్కూల్ జూనియర్ రెడ్ క్రాస్ కన్వీనర్స్ పి.రామకృష్ణ, ఈ.రమాదేవి, రెడ్‌క్రాస్ స్టాఫ్, ఉమాశంకర్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాజీ ఎంపీ కణితి విశ్వనాథం ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక లయన్స్‌క్లబ్ ఆవరణలో గల ఆయన విగ్రహానికి వైకాపా జిల్లా ఉపాధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టిబాబు) మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగా సాయికృష్ణ, పలాస–కాశీబుగ్గ పట్టణ వైకాపా అధ్యక్షులు శిష్టు గోపి, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గం ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు, వైకాపా పలాస మండలం అధ్యక్షుడు దువ్వాడ రవి, వైకాపా యూత్ తలగాన కిషోర్, నెయ్యల శివ తదితరులున్నారు.

– సత్యంన్యూస్, పలాస




మండలంలోని ప్రధాన నీటి వనరు అయిన హద్దుబంగి గెడ్డలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరుతూ కొత్తూరు నీటి సంఘం ఉపాధ్యక్షులు లోతుగెడ్డ ఆనందరావు ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆనందరావు తెలిపారు. – సత్యంన్యూస్, కొత్తూరు

# పీఆర్సీని ప్రకటించాలి

(సత్యంన్యూస్, నరసన్నపేట)



కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించి ఐఆర్‌ను విడుదల చేయాలని వైసీపీ ఉద్యోగుల,పెన్షనర్ల అసోసియేషన్ నరసన్నపేట అధ్యక్షుడు వై వి రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉద్యోగుల న్యాయపరమైన కోరికలని ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు.

# అమెరికాకు చెందిన వి ఫర్ నీడి సంస్థ ఆర్థిక సహాయం

(సత్యంన్యూస్, పలాస)

పలాసకు చెందిన వికలాంగుడు బుట్ట గంగాధర్ రోడ్ ప్రమాదంలో మరణించారు. అతని భార్య సరళ నడుము విరిగి ఆసుపత్రి పాలైంది. వారి ముగ్గురు ఆడపిల్లలు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న అమెరికాకు చెందిన "వీ ఫర్ నీడీ" సంస్థ ఆడపిల్లల సంక్షేమం కోసం రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని మన బడి వెల్ఫేర్ అసోసియేషన్, వల్లేవలస సభ్యులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి అందించారు. వి ఫర్ నీడి చేసిన సహాయానికి గంగాధర్ కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆ ఆడపిల్లల చదువుల విషయంలో మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ ఎప్పుడు ఆ కుటుంబానికి తోడు ఉంటుందని హామీ ఇచ్చారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001




# పాత బుకీలు.. కొత్తగా బెట్టింగులు!

(మొదటిపేజీ తరువాయి)

క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులపై మాత్రం చర్యలు తీసుకోలేకపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో బెట్టింగ్ యాప్‌లతో బుకీలు రెచ్చిపోతున్నారు.

ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు సంబంధించి అనధికారిక బెట్టింగ్ యాప్‌లను రన్ చేస్తూ పాత బుకీలు మళ్లీ తెరపైకి వచ్చారు. ఈసారి సరి కొత్త ఎత్తుగడతో పోలీసులను ముప్పతిప్పలు పెడుతున్నారు. శ్రీకాకుళం నగరంలో 11 మంది బుకీలు సిండికేట్‌గా ఏర్పడి విశాఖపట్నం నుంచి అరువు తెచ్చుకున్న అనధికారిక బెట్టింగ్ యాప్‌లతో లక్షలు కొల్లగొట్టేస్తున్నారు. ఇక్కడి బుకీకి డబ్బులి వ్వడం, గెలిస్తే వారి నుంచే సొమ్ములు తీసుకోవడం వంటి పాత సంప్రదాయం ఈ యాప్‌ల వల్ల కనుమరుగైపోయింది. అందుకే యాప్‌లపై కూడా ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని ప్రయత్నించింది. అయితే ప్రచారంలో లేని, అనుమతులు లేని ఐదు యాప్‌లు స్పిన్ ఎక్స్ఛేంజ్, గ్రీన్ డాట్, విన్ ఐపీఎల్, ఎక్స్ఛేంజ్ ఆఫ్ రాధేతో పాటు మరికొన్ని యాప్‌లకు సంబంధించిన ఐడీ, పాస్‌వర్డ్‌లను జిల్లా యువతకు ఇచ్చి, వారి నుంచి లక్షలాది రూపాయలు కొట్టేస్తున్నారు. ఇక్కడ రూపాయికొక పాయింట్ చొప్పున యాప్‌లో కొనుగోలు చేయాలి. ఇలా యాప్‌లు వాడుతున్నప్పుడు బుకీల మధ్య పోటీ ఏర్పడి నష్టపోతున్నారని తేలడంతో నగరానికి చెందిన 11 మంది బుకీలు సిండికేట్‌గా ఏర్పడి, దీన్ని వ్యవస్థీకృతం చేశారు. దాంతో ఎవరు బెట్టింగ్ కాయాలన్నా ఈ 11 మంది దగ్గర నుంచే యాప్ ఐడీ తీసుకోవాలి. వచ్చిన లాభాలను కూడా ఈ 11 మంది పంచుకోవాలి. ఇది ప్రస్తుతం నగరంలో బుకీల మధ్య కుదిరిన ఒప్పందం.

## బుకీలు తప్ప బాగుపడ్డవారు లేరు

లాలా, ఇటుకుల రమణ, దేవి, సెహ్వాగ్‌లతో పాటు మరో ఏడుగురు వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చి సిండికేట్‌గా ఏర్పడి బెట్టింగ్ యాప్‌లను మారుమూల ప్రాంతాలకు కూడా పరిచయం చేస్తున్నారు. వీరందరికీ నరసన్నపేటకు చెందిన ఇద్దరు బుకీలు పూర్తిస్థాయిలో అండదండలు అందిస్తున్నారు. విశాఖపట్నం నుంచి బెట్టింగ్ లైన్‌ను శ్రీకాకుళానికి తెప్పించుకుని పెద్ద ఎత్తున యువకుల నుంచి సొమ్ము కొట్టేస్తున్నారని తెలుస్తోంది. ఇటీవల కాలంలో జిల్లాలో బెట్టింగ్ కాసి రూపాయి సంపాదించినవాడు లేడని భోగట్టా. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తున్నందున బెట్టింగ్‌లు కూడా జోరుగా సాగుతున్నాయని పోలీసులు భావిస్తున్నారు. దీనిపై వివ రాలు సేకరించేందుకు స్థానిక డీఎస్పీ కార్యాలయం దగ్గరున్న శేఖర్ అనే బుకీని స్టేషన్‌కు రమ్మని కబురు పెట్టారని, అప్పట్నుంచీ శేఖర్ పరారీలో ఉన్నాడని భోగట్టా. శేఖర్ లేకపోయినా చిన్నబరాటం వీధిలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్న సెహ్వాగ్, దేవీ, లాలా, ఇటుకుల రమణ వంటివారు వ్యవహారాలు చక్కబెడుతున్నారని తెలి సింది. ఈ దందాల కోసమే నగరంలోని మారుమూల ప్రాంతంలో ఇంటిని అద్దెకు తీసుకున్నట్టు తెలుస్తోంది. వచ్చే నెలాఖరు వరకు ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతాయి. శని, ఆదివారాల్లో రెండేసి మ్యాచ్‌లు జరుగుతుండగా, మిగిలిన రోజులు ఒక్కో మ్యాచ్ జరుగుతున్నాయి. ఇప్పటి వరకు జరిగిన అన్ని మ్యాచ్‌ల మీద పందెం కాసి ఓడిపోయినవారే ఎక్కువమంది ఉన్నారు. ఐపీఎల్ సీజన్ ముగిసిన తర్వాత ఐపీ పెట్టినవారు, ఆత్మహత్య చేసుకున్నవారి వివరాలు బయటపడితే బుకీలు ఎంతవరకు బాగుపడ్డారో తెలుస్తుంది.

# విలీనం నుంచి విముక్తి.. అంత వీజీ కాదండోయ్!

(మొదటిపేజీ తరువాయి)

టీడీపీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన ప్రస్తుత చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు కూడా తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రెండు పంచాయతీలను శ్రీకాకుళం నగరపాలక సంస్థ నుంచి మినహాయిస్తామని ఆ గ్రామ పెద్దలకు భరోసా ఇచ్చారు. వీరితో పాటు కుశాలపురం గ్రామంలో ఉన్న బీజేపీ సీనియర్ నాయకులు పైడి సాంబమూర్తి, తమ్మినేని గోవిందరావు తదితరులు నగరపాలక సంస్థలో గ్రామాన్ని విలీనం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధిష్టానానికి లేఖలు రాశారు. ఇలా అన్నివైపుల నుంచి ఒత్తిడి రావడంతో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆయా గ్రామాల ప్రజల అభీష్టాన్ని గౌరవిస్తున్నట్టు ఎచ్చెర్ల ఎమ్మెల్యేకు సూచనప్రాయంగా వెల్లడించారు. దీంతో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పాటైన మొదట్లో మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి జెడ్పీలో నిర్వహించిన అధికారుల సమీక్షలో శ్రీకాకుళం నగరపాలక సంస్థలో రాగోలు గ్రామ పంచాయతీని విలీనం చేయాలన్న ఆలోచనను బయటపెట్టారు. దీంతో తోటపాలెం, కుశాలపురం గ్రామాలు శ్రీకాకుళం నగరపాలక సంస్థ నుంచి తీసేయాలని ఆ రోజే నిర్ణయించారు.

## స్పందించిన సీఎంవో

మంత్రి అచ్చెన్న, ఎమ్మెల్యే గొండు శంకర్‌ల అభిప్రాయంతో ఏకీభవించిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు 2024 నవంబర్ 11న సీఎం చంద్రబాబు పేషీకి, మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణకు లేఖలు రాశారు. దీనిపై స్పందించిన సీఎం పేషీ ఎమ్మెల్యే ఈశ్వరరావు రాసిన లేఖను ఈ ఏడాది ఫిబ్రవరి 17న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో మంత్రివర్గ సమావేశంలో చర్చకు పెట్టి రెండు పంచాయతీలను శ్రీకాకుళం నగరపాలక సంస్థ నుంచి డీనోటిఫై చేసేలా తీర్మానం చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత ఆర్డినెన్స్ తెచ్చి ఆరు నెలల్లో చట్టం చేయాల్సి ఉంటుంది. చట్టం అయితే ఈ రెండు పంచాయతీలకు ఎన్నికలు జరుపుకోవచ్చా? అలాగే మిగిలిన ఐదు పంచాయతీలతో కార్పొరేషన్ ఎన్నికలకు వెళ్తుందా? అనేది ఇక్కడ ఎవరికీ అంతుచిక్కని ప్రశ్న. న్యాయనిపుణులు మాత్రం చట్టం చేసినా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసు ఉపసంహరించడానికి వీలుపడదంటున్నారు. ఈ రెండు పంచాయతీలతో పాటు మిగతా ఐదు పంచాయతీలకు చెందినవారు ఇందులో ఇంప్లీడ్ అయివున్నారు.

## పెండింగ్‌లో రెండు పిటిషన్లు

2013లో జారీ చేసిన పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌లో ఏడు పంచాయతీలను మినహాయించి ఎన్నికలు నిర్వహించాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. దీనిపై పాత్రునివలస, ఖాజీపేట, తోటపాలెం, కుశాలపురానికి చెందినవారు మరోమారు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ నాలుగు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించడంతో ఎన్నికలు నిర్వహించారు. వీరి పదవీకాలం 2018 ఆగస్టుతో ముగిసింది. పంతానికి పోయిన అప్పటి ప్రభుత్వం వెంటనే ప్రత్యేక అధికారులను పంపించి, పంచాయతీ తీర్మానాలు చేసి ఈ నాలుగు పంచాయతీలను విలీనం చేసినట్లు ప్రకటించింది. ఆ తర్వాత 2020 కరోనా కాలంలో వైకాపా ప్రభుత్వం బడ్జెట్ కోసం ఒక్క రోజు సమావేశపరిచిన శాసనసభలో ఏడు పంచాయతీలను విలీనం చేస్తూ చట్టం చేసింది. చట్టాన్ని కోర్టులో సవాల్ చేయడం కుదరదని, చట్టం చేసే పద్ధతిలో లోపాలుంటేనే కోర్టుకు రావాల్సి ఉంటుంది కాబట్టి ఏడు పంచాయతీల నుంచి వేసిన పిటిషన్ చెల్లదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. దీంతో కోర్టు సూచనల మేరకు అందరూ కలిసి చట్టంపై రిట్ పిటిషన్ దాఖలు చేశారు. 2021 మార్చిలో స్థానిక ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినా, అందులో ఈ ఏడు పంచాయతీలను మినహాయించారు. అదే సమయంలో నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణకు సిద్ధపడగా.. కోర్టులో కేసు ఉండగా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని మరోమారు న్యాయస్థానం తలుపు తట్టారు. దీంతో కోర్టు తీర్పు వెలువడేంతవరకు ఏడు పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించమని ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఇక కార్పొరేషన్‌లో డివిజన్ల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేసే సమయంలో నగరంలో ఉన్న దళితుల సంఖ్యను తక్కువగా చూపించారంటూ కొందరు దళిత సంఘాల నాయకులు మరో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ రెండూ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ కోర్టు నుంచి విత్‌డ్రా అయితే గానీ ఎన్నికలు జరిపే అవకాశం లేదు. తోటపాలెం, కుశాలపురం మాదిరిగానే శ్రీకాకుళం రూరల్‌లో ఉన్న మిగిలిన ఐదు పంచాయతీలు కూడా తాము మున్సిపాలిటీలో కలిసే ప్రసక్తి లేదంటున్నాయి. కార్పొరేషన్‌లో కలిస్తే ఎన్ఆర్ఈజీఎస్ పనులు ఆగిపోతాయని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కాస్తో కూస్తో పనులు జరుగుతున్నాయి కాబట్టి కార్పొరేషన్‌లో కలవబోమంటున్నారు. కానీ పార్టీతో సంబంధం లేకుండా నేతలంతా ఇవి పేరుకే పంచాయతీలు గానీ, నగరానికి ఆనుకొనే ఉన్నాయని, ఇక్కడ భారీ భవంతులు ఉండటం వల్ల రోడ్డు, తాగునీరు, కాలువలు వంటి సౌకర్యాలు కల్పించాం కాబట్టి కార్పొరేషన్‌లో ఉండాలని కోరుతున్నారు. ఇక్కడ ప్రజలు కూడా కార్పొరేషన్‌లో చేరితే పన్నులు పెరిగిపోతాయని స్థానిక నాయకుల మీద ఒత్తిడి తెస్తున్నారు.

## రాగోలు విలీనంపై చర్చ

దళితుల జనాభాపై హైకోర్టులో దాఖలైన దావా జనగణన పూర్తయ్యేవరకు తేలదు. ఎస్సీ వర్గీకరణపై కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, దీనిపై నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదిక ఇవ్వడంతో ఇప్పుడు నగరపాలక సంస్థలో దళితుల జనాభా వివరాలు బయటపడతాయి. అంతవరకు న్యాయస్థానంలో దళిత సంఘాలు వేసిన దావా కొనసాగుతూనే ఉంటుంది. దీంతో పాటు కుశాలపురం, తోటపాలెం పంచాయతీలను నగరపాలక సంస్థ నుంచి తొలగిస్తే 50 డివిజన్లు 48 డివిజన్లకు తగ్గిపోతాయి. దీంతో మళ్లీ 50 డివిజన్ల హద్దులను మార్చాల్సి ఉంటుంది. మరోవైపు టీడీపీ నేతల ఆలోచనలో భాగంగా రాగోలు గ్రామ పంచాయతీని విలీనం చేయడానికి కసరత్తు చేస్తే, దాన్ని రెండు డివిజన్లుగా మార్చాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని రెండు పంచాయతీలు బయటపడిన వెంటనే శ్రీకాకుళంలో ఉన్న ఐదు పంచాయతీలను కూడా అదే మాదిరిగా బయటకు తేవాలన్న ఒత్తిడి నాయకుల మీద పెరుగుతుంది. కార్పొరేషన్‌కు ఎన్నికలు జరపాలంటే పాత మున్సిపాలిటీలో 36 వార్డులనే పరిగణలోకి తీసుకొని ముందుకెళ్లాలి. లేదూ పంచాయతీలతో కలిపి నిర్వహించాలంటే కోర్టు కేసులు విత్‌డ్రా చేయించాలి. ఒకసారి కార్పొరేషన్ అయిన తర్వాత దాని నిధులు, విధుల్లో చాలా మార్పులు వస్తాయి. కార్పొరేషన్ పేరుతో ఇన్నాళ్లూ వసూలుచేసిన పన్నులను ఇప్పుడు మున్సిపాలిటీ అయితే తగ్గించాల్సి ఉంటుంది. ఇందులో తేడాలు వస్తే మరికొందరు కోర్టుకు వెళ్లే అవకాశం లేకపోలేదు. ఏతావాతా తేలేదేమంటే.. త్వరలోనే మున్సిపాలిటీకి ఎన్నికలు జరుగుతాయని ఇంకా ఎవరైనా భావిస్తే అంతకంటే అమాయకత్వం మరోటి ఉండదు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.